క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



కోలా గురువులును సత్కరిస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పూర్ణిమ

కంచరపాలెం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులును శుక్రవారం 41వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ పార్టీ కార్యాలయంలో కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు గురువులుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్, వేశంగిణీరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్‌కు టాలెంట్ ఐకాన్ అవార్డు



టాలెంట్ ఐకాన్ అవార్డుతో కృష్ణవీర్ అభిషేక్

దాబాగార్డెన్స్ : భాషావేత్త, రచయిత డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్‌కు విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ టాలెంట్ ఐకాన్ అవార్డును బహూకరించింది. కృష్ణవీర్ అభిషేక్ సాహిత్యానికి, భాషా నమూనాల ప్రోత్సాహానికి చేసిన కృషికి గుర్తింపుగా ఏపీ టూరిజం అథారిటీ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో ఈ అవార్డును అందజేశారు. అలాగే ఏవీ నరసింహం, బెహరా ఉమామహేశ్వరరావు, ఎం. శ్రీరాములు, డాక్టర్ మాడుగుల జాన్, సీహెచ్ ప్రవీణ్‌కుమార్, బీఎస్ గణపతి, బీవీకే చైతన్యకు కూడా అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ ఆర్. మణిభూషణ్‌కుమార్, బ్రహ్మకుమారి రామేశ్వరి, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సురేష్‌కుమార్, నరవ ప్రకాశరావు, చదలవాడ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భండాసుర వధపై ప్రవచనం



ప్రవచిస్తున్న రమ్యానంద భారతీ స్వామిని

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచన కార్యక్రమం ఘనంగా జరుగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని జగన్మాత లలితాదేవి వివిధ పరివార దేవతల శక్తులను, రాక్షస సంహారంలో వారి పాత్రల గురించి ప్రవచించారు. భండాసుర వధ ఘట్టాన్ని వివరిస్తూ శ్రీబాల త్రిపుర సుందరీ దేవి, మహాగణపతి అవతార విశేషాలు, రాక్షస సైన్య వ్యూహాలను అమ్మవారు ఎలా చిత్తుచేశారు, భండాసురుడిని ఎలా వధించారో వివరించారు. అనంతరం భక్తులందరికీ వస్త్రం, శ్రీచక్ర యంత్రాలను ప్రసాదంగా అందజేశారు. కార్యక్రమంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో ప్రవచనాలు ఆలకించారు.

'జోగి రమేష్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలి'

సీతమ్మధార: జోగి రమేష్‌ను మంత్రి వర్గం నుంచి తొలగించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేష్‌పై మంత్రి జోగి రమేష్ విమర్శలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జోగి రమేష్ మాటలు బీసీల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, కోరాడ రాజబాబు, పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితం..!

- వెలగని లైట్లు.. వేలాడుతున్న వైర్లు
- అంధకారంలో వీధులు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



గౌరీనగర్‌లో విద్యుత్ లైట్లు వెలగక చీకట్లు



గొల్లకంచరపాలెంలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధిలో విద్యుత్ స్తంభాలు ప్రమాదభరితంగా మారాయి. వీధిలైట్ల నిర్వహణను గాలికొదిలేశారు. రామ్మూర్తిపంతులుపేట, గవర కంచరపాలెం, తోట వీధి, గౌరీనగర్, గొల్లకంచరపాలెం ప్రాంతాల్లో చీకట్లు రాజ్యమేలుతున్నాయి. కరెంట్ స్తంభాలకు లైట్లు లేకపోవడం, మరికొన్ని చోట్ల పనిచేయకపోవడంతో వీధుల్లో అంధకారం నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురు గాలులకు విద్యుత్ లైట్లు వైర్లు తెగిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో చీకట్లు కనిపిస్తున్నాయి. రాత్రి వేళ రాకపోకలు సాగిస్తున్న వారు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గొల్లకంచరపాలెం శ్రీకృష్ణ మందిరం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకొని ఉన్న స్తంభం వద్ద ప్రమాదకరంగా కట్‌ఔట్ వైర్లు వేలాడుతున్నాయి. ఇక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. గౌరీనగర్‌లో నెల రోజులుగా లైట్లు వెలగడం లేదని ఆరోపిస్తున్నారు. 44బీ/7/2 నుంచి 9/3 వరకు గల విద్యుత్ స్తంభాలకు లైట్లు పనిచేయడం లేదు. విద్యుత్ దీపాల సమస్యపై జీవీఎంసీ విద్యుత్ విభాగానికి, ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలపై ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాలవాసులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీ



విజేతలతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు శుక్రవారం లైబ్రరీ సొసైటీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ నిర్వహించారు. 50 మంది విద్యార్థులు ఏడు గ్రూపులుగా పాల్గొన్నారు. వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన వర్తమాన అంశాలు, చరిత్ర, సాంకేతిక, విజ్ఞానం, ఆర్థిక, రాజనీతి, భూగోళ శాస్త్రాలు మొదలైన విషయాలపై 60 ప్రశ్నలు అడిగారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు క్విజ్‌మాస్టర్‌గా వ్యవహరించారు. విజేతలకు పుస్తకాలు బహుమతిగా అందజేశారు. ఉద్యోగార్థుల సామర్థ్యాలు తెలుసుకోవడానికి ఇటువంటి క్విజ్ పోటీలు దోహదపడతాయని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ముస్లిం ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 36వ వార్డులోని జామీయా మసీదు వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి హామీ పత్రాలు ఇచ్చినప్పటికీ అనివార్య కారణాల వల్ల ఇళ్ల స్థలాలు రాని వారి కోసం మూడవ దఫా మంజూరు చేయాలని, నిరుద్యోగ యువతకు జీవీఎంసీ శానిటేషన్ విభాగం, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాలు కల్పించాలని, పెన్షన్లు అందజేయాలని పలువురు ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముస్లిం ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ముస్లింల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడారు. అలాగే గత వారం ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలు శత శాతం పరిష్కారం అయ్యాయా? లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కర్రి నీలకంఠం, బెహరా వెంకటరత్నం, ముజీబ్‌ఖాన్, బొగ్గు శ్యామ్, ఆదివిష్ణు, బోని దేవా, దళమంతుల చిన్ని, కడియం ప్రసాద్, చిన్నమ్మలు, రమణి, బొడ్డేటి కిషోర్, ఆరుగుల రాజు, వాసుపల్లి నారాయణరావు, సాగర్, రామరాజు, వాసు, ముస్లిం నాయకుడు రఫీ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

అచ్చియ్యమ్మపేటలో..

అల్లిపురం : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం అచ్చియ్యమ్మపేట, వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయనకు 32వ వార్డు ఏడుగుళ్ల ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు విద్యుత్ సరఫరా కల్పించాలని కోరారు. స్పందించిన ఆయన ఏపీఈపీడీసీఎల్ అధికారులతో మాట్లాడి వారి సమస్య పరిష్కరించాలని కోరారు. కొబ్బరితోటలో సొంత స్థలం కలిగిన వారికి బీఎస్‌సీలో ఇళ్లు మంజూరు చేయాలని కోరిన మేరకు హౌసింగ్ బోర్డు అధికారులతో మాట్లాడి ఆ ఏర్పాట్లు చేయాలని కోరారు. అదే విధంగా ఇళ్లు, కొత్త పెన్షన్లు మంజూరు చేయించాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. ఈ మేరకు ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కారం అయిన లబ్ధిదారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు 27వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరావు, జేసీజే ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, వార్డు సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, దూడ అప్పారావు, బొగ్గు శ్యామ్, ఆదివిష్ణు, బాపు ఆనంద్, వాసుపల్లి నారాయణరావు, తాతబ్బాయి, బొడ్డేటి కిషోర్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాంపింగ్ పనులకు శంకుస్థాపన



35వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి తదితరులు

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు సీహార్స్ జంక్షన్ వద్ద ర్యాంపింగ్ పనులకు శుక్రవారం శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ వర్షాలు పడినప్పుడు 29,36,37 వార్డుల నుంచి మురుగునీరు కేజీహెచ్‌కి దిగువన ఉన్న 35వ వార్డు పరిధిలో ఉండే పూర్ణా మార్కెట్, వెలంపేట ప్రాంతాలను ముంచెత్తుతుందని తెలిపారు. ఆ సమయంలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించి కాలువ మీద వేయడానికి, అనంతరం దానిని తరలించేందుకు ర్యాంపు వీలు కల్పిస్తుందని తెలిపారు. వర్షాల వల్ల కలుగుతున్న ఇబ్బందులను మేలోనే కౌన్సిల్‌కు తెలిపామన్నారు. రెండు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో మోకాలి లోతు వరకు నీరు చేరి చిలకలవీధి ప్రాంతంలో నిలిచిపోయిందన్నారు. వెంటనే సమస్యను మేయర్, కమిషనర్‌ల దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన అధికారులు రూ. 15 లక్షలు మంజూరు చేశారన్నారు. ర్యాంపు నిర్మాణంతో మురుగు నీరు ఎస్ఎల్ కెనాల్ ద్వారా నేరుగా సముద్రంలో కలుస్తుందన్నారు. ఆ పనులకు నేడు శంకుస్థాపన జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, వార్డు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం



ప్రిన్సిపాల్ విజయను పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది

దాబాగార్డెన్స్ : ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా పని చేస్తానని విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ జె. విజయ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన విజయను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల, కె. కోటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన అనుభవంతో విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చానని, మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తానన్నారు. ప్రతి విద్యార్థినిపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ, విద్యలో వెనుకబడిన పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాలో ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పనులు త్వరగా పూర్తి చేసి విద్యార్థినులకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్టు చెప్పారు.

సాంకేతికతను అందుబాటులోకి తేవాలి

- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్. చిత్రంలో చైర్మన్ ప్రసాదరాజు

మహారాణిపేట : జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాల రైతులకు సాంకేతికత అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను కోరారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు రైతులకు ఆర్బీకేల ద్వారా అందుబాటులో ఉంచాలన్నారు. వరి కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా సక్రమ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీనివల్ల రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉంటుందన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు రెన్యువల్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని బ్యాంకు అధికారులను కోరారు. ఇటీవల అధిక వర్షాల వల్ల ముంపునకు గురై నష్టం వాటిల్లిన వరినారు సమాచారం ప్రభుత్వానికి నివేదిక పంపించాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీఏ ప్రసాద్‌రాజు మాట్లాడుతూ భూసార పరిస్థితులను బట్టి అధిక దిగుబడినిచ్చే పంటలను, పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి సూచనలు అందించాలన్నారు. ప్రభుత్వం అందించే రాయితీ రైతులకు ఆర్బీకే కేంద్రాల ద్వారా వర్తించేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి మండల, గ్రామస్థాయిలో చర్చించిన విషయాలు జాయింట్ కలెక్టర్‌కు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పశుసంవర్ధక, ఉద్యానవన, పట్టు, ఇతర అనుబంధ శాఖలు, పౌరసరఫరాల అధికారులు చేపడుతున్న అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ , లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రాజేశ్వరి, ఉద్యానవన శాఖ అధికారి మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలకే అంకితం.. జగ్గారావు జీవితం



జగ్గారావు వర్ధంతి కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, సిబ్బంది

దాబాగార్డెన్స్ : నిరంతరం ప్రజాసేవ, విద్యా సేవకే అంకితమైన మహోన్నత వ్యక్తి ఏవీ జగ్గారావు అని ఏవీఎన్ కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్‌భానోజీరావు కొనియాడారు. ఏవీఎన్ కళాశాల పూర్వ కరస్పాండెంట్ ఏవీ జగ్గారావు 33వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అదీప్ ముందుగా జగ్గారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావేత్తగా, వాణిజ్యశాస్త్ర నిపుణుడిగా పేరొందిన తన తండ్రి జగ్గారావు ఏయూ పాలకమండలి సభ్యుడిగా, విశాఖ మున్సిపల్ కౌన్సిల్ పాలకమండలి సభ్యుడిగా, భారత రక్షణ సర్వీసులకు ఆర్టిలరీ రెజిమెంట్‌కు అధ్యక్షుడిగా సేవలందించిన గొప్ప వ్యక్తని పేర్కొన్నారు. విశాఖ పోర్టు ట్రస్ట్ సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యుడిగా ఎనలేని సేవలందించారని ప్రశంసించారు. ఏవీఎన్ కళాశాల యాజమాన్య మండలి ఉపాధ్యక్షుడిగా సీతారామరామస్వామి ఆలయ అనువంశిక సభ్యుడిగా కూడా సేవలందించారని గుర్తు చేశారు. అంతే కాకుండా నేచురల్ హిస్టరీ సొసైటీ ఉపాధ్యక్షుడిగా, రోటరీ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడిగా, వాల్తేర్ క్లబ్ అధ్యక్షుడిగా కూడా సేవలందించారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పురస్కారాలు అందుకున్నారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ బ్రిటన్, అమెరికా అంతర్జాతీయ పారిశ్రామికవేత్తల సంయోజనంతో సీనియర్ మేనేజ్‌మెంట్ అనుభవాన్ని సంతరించుకున్నారని చెప్పారు. చమురు ఉత్పత్తులు, లెదర్‌తో కూడిన వస్తువులు, ఫిషింగ్ రంగాల్లో విశాఖపట్నం స్థాయిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపేందుకు చేసిన కృషిని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ శంకర్‌నారాయణ, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి. కృష్ణమురళీవంశీ, పైడి రజని, గాంధీ, స్వరాజ్యలక్ష్మి, అర్చన, కృష్ణకుమారి, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో ఔషధ మొక్కల ఏర్పాటు



వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న కీర్తి పట్నాయక్ తదితరులు

దాబాగార్డెన్స్ : పాతనగరం శృంగమణి పర్వతంపై వెలసిన పోర్టు వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి విజ్ఞాన జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్ శుక్రవారం హరిత వనం పేరిట ఔషధ, (పమిడి పత్రి) పూలమొక్కలు నాటారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు, అలయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ పి. మురళీధర్, ఎం. నాగేశ్వరరావు, టి. వెంకటాచారి, యూజేఆర్ పట్నాయక్ సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు కీర్తి పట్నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా 12 రాశి వనాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ సురేష్, అల్లు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ పార్క్ పనులు ప్రారంభం



నక్కవానిపాలెంలో ఇందిరా గాంధీ పార్క్

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఇందిరా గాంధీ పార్క్ అభివృద్ధి పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వీటి కోసం జీవీఎంసీ రూ.8 లక్షల నిధులు విడుదల చేయడం తెలిసిందే. కొన్నేళ్లుగా పర్యవేక్షణ లేకపోవడంతో పార్కులోని వస్తువులు తుప్పుపట్టి పాడయ్యాయి. దీనిపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తూ పార్కును అందుబాటులోకి తేవాలని గతంలోనే కోరారు. ఎట్టకేలకు ఈ ఉద్యానవనం పూర్వవైభవానికి అడుగు ముందుకు పడింది. పార్కులో పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, పెద్దలు సాయంత్రం వేళ వచ్చి కాలక్షేపం చేసుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తమ కాలనీ పార్కును అభివృద్ధి చేస్తుండటంతో నక్కవానిపాలెం వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

దాబాగార్డెన్స్ : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిరోధంపై నగరంలోని ప్రతి కళాశాలలో హిమా హ్యూమానిటేరియన్ సంస్థ విద్యార్థులకు అవగాహన శిబిరాలు నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేయడం అభినందనీయమని ఆ సంస్థ ప్రతినిధులను కొనియాడారు. మాదక ద్రవ్యాల నిరోధంపై దాబాగార్డెన్స్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ సరదా కోసం, స్నేహితుల ప్రోద్బలం, ప్రభావంతో ప్రారంభించిన చెడు అలవాట్లు పిల్లల మెడకు చుట్టుకుంటున్నాయని, యువత మంచి మార్గంలో నడుచుకోవాలని హితవు పలికారు. రిటైర్డ్ జడ్జి కిషోర్‌కుమార్, పైలా సన్నిబాబు, శరగడం సురేష్‌కుమార్ డ్రగ్స్ కోసం యువత నేరాలకు పాల్పడతున్నారని, స్కూల్ పిల్లలు సైతం డ్రగ్స్‌కి అలవాటు పడటం విచారకరమన్నారు. ఈ సందర్భంగా హిమా హ్యూమానిటేరియన్ వ్యవస్థాపక కార్యదర్శి టీవీడీ దాస్ విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, అటువంటి వారు తమకు తారస పడితే వాళ్లని మందలించి సక్రమ మార్గంలో నడుచుకోమని హితబోధ చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. హిమా హ్యూమానిటేరియన్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ మూర్తి, ఆదిత్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ పి. రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కె. కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోండి



బీటీఆర్ కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

సీతంపేట: వారం రోజులకు మించి వర్షపు నీరు లేదా తాగునీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను వ్యాప్తి చేసే దోమలు వృద్ధి చెందుతాయని జీవీఎంసీ మలేరియా ఇన్‌స్పెక్టర్ బంధం శ్రీనివాసరావు అన్నారు. ఫ్రైడే-డ్రైడే సందర్భంగా 25వ వార్డు సీతంపేట బీటీఆర్ కాలనీలో దోమలు పెరిగే ప్రదేశాలపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా వారానికి ఒకరోజు డ్రైడే పాటించేలా యాంటీ లార్వా ఆపరేషన్లపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులు, మనీ ప్లాంట్లు, ఫ్రిజ్ వెనుక బాక్సులను శుభ్రపర్చి మళ్లీ నీరు పట్టుకోవాలని స్థానికులకు సూచించారు. గోళాలు, కుండీల్లోకి దోమలు చొరబడకుండా మూతలు పెట్టాలన్నారు. దోమలు పెరిగే ప్రదేశాలపై అవగాహన కల్పించి, కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.ఎస్.ఎస్.నారాయణ, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

26వ వార్డులో..

ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులకు దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నియంత్రణపై మలేరియా సిబ్బంది శివ అవగాహన కల్పించారు. వారం రోజులు నీరు నిల్వ ఉంటే దోమలు గుడ్లు పెట్టడం వల్ల అవి వృద్ధి చెందుతాయన్నారు. మలేరియా, డెంగ్యూ జ్వరాలను వ్యాప్తిచేసే దోమలు తాగునీరు, వర్షపు నీటి నిల్వల్లో పెరుగుతాయని వివరించారు. వారానిని ఒక రోజు నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, డ్రమ్ములు, ట్యాంకులు, సంపులను శుభ్రపర్చుకోవాలని సూచించారు. దోమ లార్వాను విద్యార్థులకు చూపించారు. అటువంటి లార్వా మీ ఇంటి పరిసరాలు, నీటిలో పెరగకుండా చూడాలని సూచించారు.

ప్రకృతి వనరుల పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: స్థానిక వీఎంసీ డిగ్రీ కళాశాలలో ప్రకృతి వనరుల పరిరక్షణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, గ్రీన్ క్లైమేట్ టీం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు సమక్షంలో విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రకృతి వనరులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అడవులు, జీవావరణాలను పరిరక్షించినప్పుడే మానవ మనుగడ సజావుగా సాగుతుందన్నారు. ఆరోగ్యకరమైన జీవనం ప్రకృతి పరిరక్షణతోనే సాధ్యమవుతుందన్నారు. గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో యువత ఎక్కువగా భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో అప్పారావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యావరణానికి విఘాతం మానవాళికి నష్టం

ఏయూ క్యాంపస్: పర్యావరణానికి విఘాతం కలిగిస్తే మానవాళికి నష్టం తప్పదని గాయత్రి విద్యా పరిషత్ సంయుక్త కార్యదర్శి ఆచార్య పి.రాజ గణపతి అన్నారు. శుక్రవారం బీచ్‌రోడ్డులోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో ఇక్షే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఇక్షే సంస్థ సభ్యుడు పి.మధు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, డి.గిరిధర్, వెంకటకృష్ణ, డి.వి.ఎస్. ఎస్.పద్మ, సంస్థ అధ్యక్షుడు యు.సి.ఎం.పట్నాయక్ పాల్గొన్నారు.